నేడు ఉచిత వైద్య శిబిరం

జియాగూడ: కుర్మబస్తీలోని రంగనాథ కల్చరల్‌ అసోసియేషన్‌లో జనహిత సేవా ట్రస్ట్‌ సొసైటీ ఫర్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌, కిమ్స్‌ ఫౌండేషన్‌, రిసెర్చ్‌ల సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 21న ఉచిత వైద్య శిబిరం ఉంటుందని ఇమాంపురా నవ భారత సంఘం అధ్యక్షులు మధిర సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వైద్య శిబిరాన్ని నిర్వహించి పరీక్షలు, మందులను కూడా అందజేశారన్నారు. ముఖ్యంగా జనరల్‌ ఫిజిషయన్‌, ఆర్థోపెడిక్‌ గైనాలకాలజీ, పీడియాట్రిక్‌, ఈసీజీ, షుగర్‌, బీపీ, ఫిజియోథెరఫీ తదితర పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పంచదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఆనంద్‌



చార్మినార్‌: డబీర్‌పురాలోని పంచదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పింజరోల్ల ఆనంద్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సమావేశమైన ప్రతినిధుల బృందం ఆయనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లింగాల ప్రేమ్‌ కుమార్‌, ఉపాధ్యక్షుడిగా జె.సోమసుందర్‌, కార్యదర్శిగా నక్క మహేందర్‌ గౌడ్‌, కోశాధికారిగా పింజరోల్ల సత్యనారాయణ తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్‌ మాట్లాడుతూ..ఈసారి బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్‌ జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైనార్ట్స్‌ యూనివర్సిటీలో ప్రవాహ్‌–2025 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం విద్యార్థుల నృత్యాలు, అధ్యాపకుల క్యాట్‌ వాకింగ్‌ ఆద్యాంతం అలరించాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌ ఛాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ టి.గంగాధర్‌ మాట్లాడుతూ..ఆర్కిటెక్చర్‌, విద్యార్థులకు సినిమా, టీవీ, ప్రింట్‌, ఎలక్ట్రానిక్‌ మీడియా రంగాల్లో చక్కటి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ జి.మధుకర్‌, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ కోమటిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఆర్కిటెక్చర్‌ విభాగాధిపతి, కార్యక్రమ సమన్వయ కర్త చిన్న సైదులు తో పాటు యూనివర్సిటీ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న బోయ నగేశ్‌, శ్యామ్‌రావు ముదిరాజ్‌

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో రూ.5.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం చాంద్రాయణగుట్ట కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయ నగేశ్‌, కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ నగర ఉపాధ్యక్షులు కాశమోని శ్యాంరావు ముదిరాజ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నల్లవాగు హిందూ శ్మశాన వాటికను నూతన హంగులతో తీర్చిదిద్దడమే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెరోజి సాయినాథ్‌, సాయిలు, ప్రదీప్‌, ధన్‌రాజ్‌, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన డీసీ



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని వరద ముంపు ప్రాంతాలను శుక్రవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ మంగతాయారు స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గౌలిపురా డివిజన్‌లో వరద ముంపునకు గురవుతున్న ప్రాంతాల సమస్యలను అతి త్వరలోనే పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇటీవల గౌలిపురా డివిజన్‌ వరద ముంపు ప్రాంతాల జాయింట్‌ యాక్షన్‌ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు నిర్వహించి డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందించడంతో శుక్రవారం పరిశీలన నిమిత్తం వచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌ యాక్షన్‌ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోట బోనాలకు వేళాయే..

తొలుత గోల్కొండ కోటలోనే బోనాలు ప్రారంభం

- శతాబ్దాలుగా అమ్మవారికి పూజలు
- కుతుబ్‌షాహీ రాజుల కాలంలో ప్రారంభమైన ఉత్సవాలు
- ప్రత్యేక ఆకర్షణగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు



గోల్కొండ: గోల్కొండ కోట అనగానే గుర్తుకు వచ్చేదది బోనాల జాతర. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాల ఉత్సవాలు మొట్టమొదటిసారిగా గోల్కొండ కోటలోనే ప్రారంభమవుతాయి. తమను చల్లగా దీవించమని కోరుతూ ప్రజల కోరికలను తీర్చే జగదాంబిక మహంకాళి అమ్మవారు గోల్కొండ కోటలో కొలువుదీరి ఉన్నారు. ఆషాఢ మాసంలో జరిగే బోనాల ఉత్సవాలకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. శతాబ్దాలుగా అమ్మవారికి పూజలు చేస్తూ వస్తున్నారు. కుతుబ్‌షాహీ రాజుల కాలంలో ప్రారంభమైన బోనాల ఉత్సవాలను అప్పట్లో ప్రభుత్వపరంగా నిర్వహించే ఆనవాయితీ ఉండేది. కుతుబ్‌షాహీల అనంతరం గోల్కొండను ఏలిన అసఫ్‌జాహీ పాలకులు సైతం ఈ సంప్రదాయాన్ని కొనసాగించారు. స్వాతంత్రం అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ దేవాదాయ శాఖ వారు ఆషాఢ మాసం బోనాల జాతరను నిర్వహిస్తు వస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం బోనాలను ప్రభుత్వ పండుగగా ప్రకటించింది. అప్పటి నుంచి కోట బోనాల ఖ్యాతి నలుదిశల వ్యాపించింది.

పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు..

బోనాల ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. ఘటాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు చూడడానికి వేల సంఖ్యలో భక్తులు గుమ్మిగూడుతారు. పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు, పూనకాలు చూడడానికి రెండు కళ్లు చాలవు. దీనికి తోడు బోనాలు చూడడానికి కోటకు ప్రత్యేకంగా ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తుంటారు. బోనాల పూజలు జరిగే రోజుల్లో కోటకు వచ్చే విదేశీ పర్యాటకులు బోనాల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలను కళ్లప్పగించి చూస్తారంటే అతియశక్తి కాదు. తెలంగాణలో మొట్టమొదటగా గోల్కొండ కోట నుంచి ప్రారంభమైయ్యే బోనాల ఉత్సవాలు చివరి బోనం కూడా గోల్కొండ కోటలోనే ముగిస్తుంది. అమ్మవారికి ఆషాఢ మాసంలో ప్రతి ఆది, గురు వారంలో బోనాలు నిర్వహిస్తారు.

భారీ ఏర్పాట్లు..

గోల్కొండ కోట బోనాలు వస్తున్నాయి అంటే వివిధ శాఖల అధికారులు ముందుగానే సమాయత్వం అవుతారు. అటు పోలీసు అధికారులు ఇటు దేవాదాయ శాఖ అధికారులు బోనాలకు నెల రోజుల ముందే ఏర్పాట్లను ప్రారంభిస్తారు. కోటకు రాష్ట్ర మంత్రులు సైతం ఏర్పాట్లను పరిశీలించడానికి వస్తారు. అమ్మవారికి ఘటాలు సమర్పించడానికి వచ్చే భక్తుల ఊరేగింపులో లక్షలాది మంది భక్తులు ఉంటారు. వీరి భద్రత కోసం పోలీసులు సైతం భారీ ఏర్పాట్లు చేస్తారు. జలమండలి అధికారులు సైతం భక్తులకు దారి పొడవునా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక వాటర్‌ షెడ్లను ఏర్పాటు చేస్తారు. బల్దియా అధికారుల హడావిడి కూడా ఉంటుంది. రోడ్ల మరమ్మతులను మొదలుకొని అన్ని రకాల ఏర్పాట్లను బల్దియా అధికారులు చేస్తారు.

వృత్తిపని వారి సేవలు..

అమ్మవారి బోనాల ఏర్పాట్లల్లో వృత్తిపని వారి పాత్ర కూడా ఎంతో కీలకం. వంశపార్యపర్యంగా కంసాలి, కుమ్మరి, చాకలి, జర్దీ, మస్కూరీ, డప్పు, జమడికలు లాంటి వృత్తిపని వారు బోనాల కోసం అమ్మవారికి సేవలు అందిస్తూవస్తున్నారు. అమ్మవారి షావా ఊరేగింపులో వృత్తిపని వారి పాత్ర ఎంతో కీలకం. వీరి సేవలను గుర్తించి ప్రభుత్వం వీరికి గౌరవ వేతనంతో పాటు గుర్తింపు కార్డులు కూడా ఇస్తుంది. ఈ నెల 26న అమ్మవారి మొదటి బోనం ప్రారంభం అవుతుంది.

తాతముత్తాతల కాలం నుంచి..



తాతముత్తాతల కాలం నుంచి వృత్తిపని వారు అమ్మవారి బోనాల ఏర్పాట్లల్లో చురుకుగా పని చేస్తున్నాం. గతంలో వృత్తిపని వారికి ఏమాత్రం గుర్తింపు ఉండేది కాదు. అయితే 15 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వృత్తిపని వారికి గౌరవ వేతనం ఇచ్చి మా సేవలకు గుర్తింపు ఇచ్చింది.

– సాయిబాబాచారి, వృత్తిపని సంఘం వారి మాజీ అధ్యక్షుడు

బంగారు బోనం సిద్ధం



గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి ఈ సంవత్సరం బంగారు బోనం సమర్పిస్తున్నామని అమ్మవారి వృత్తిపని సంఘం ఉపాధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి అన్నారు. బంగారు బోనాన్ని శుక్రవారం రిసాలబజార్‌లోని తన స్వగృహంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారిపై ఉన్న భక్తితోనే తమ కుటుంబం బంగారు బోనాన్ని సమర్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, శివచారి తదితరులున్నారు.

బోనాలను వైభవంగా నిర్వహించాలి



తలసానిని కలిసిన ఊరేగింపు కమిటీ ప్రతినిధుల బృందం

చార్మినార్‌: బోనాలను వైభవంగా నిర్వహించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ కోరారు. భాగ్యనగర్‌ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్‌ గోపిశెట్టి రాఘవేందర్‌ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం వెస్ట్‌ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసానిని కలిశారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ..మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వాటిలో ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలు ఒకటని పేర్కొన్నారు. ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్‌ జనగామ మధుసూదన్‌గౌడ్‌, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధి మల్యాల మధుసూదన్‌యాదవ్‌, ప్రతినిధులు భవానీశంకర్‌, గురునాథరెడ్డి, ఆనంద్‌, శంకర్‌ యాదవ్‌ తదితరులు ఉన్నారు.

మొహర్రానికి అన్ని ఏర్పాట్లు చేయాలి



గ్రేటర్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రి

చార్మినార్‌: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని నగరంలోని అన్ని అషుర్‌ ఖానాలలో తగిన ఏర్పాట్లు చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రి గ్రేటర్‌ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జి.కిషన్‌ రెడ్డి రాసిన అధికారిక లేఖను శుక్రవారం గ్రేటర్‌ కమిషనర్‌కు అందజేశామన్నారు. మొహరం సంతాప దినాల సందర్భంగా డబీర్‌పురాలోని బీబీ కా అలావాలో తాత్కాలిక షెడ్లు వేయాలన్నారు. పదో మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని డబీర్‌పురా నుంచి చార్మినార్‌ ద్వారా ఛాదర్‌ఘాట్‌ వరకు కొనసాగే పదో మొహర్రం సామూహిక ఊరేగింపు దారి పొడవునా రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. అంతేకాకుండా అన్ని అషుర్‌ ఖానాల వద్ద అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే నిర్వహించాలన్నారు.

టోలిచౌకీ పారమౌంట్‌ కాలనీలో కార్డన్‌ సెర్చ్‌



గోల్కొండ: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికే తాము కార్డన్‌ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని సౌత్‌ వెస్ట్‌జోన్‌ డీసీపీ చంద్రమోహన్‌ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ పారమౌంట్‌ కాలనీలో ఆయన ఆధ్వర్యంలో కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పారమౌంట్‌ కాలనీలోని 300 ఇళ్ల, ప్లాట్‌లను తనిఖీ చేశారు. వాటిలో నివసించే విదేశీయుల వీసాలు, పాస్‌పోర్టులు తనిఖీ చేశారు. వీసా గడువుతీరినా ఇక్కడే నివసిస్తున్న 18 మంది విదేశీయులను గుర్తించారు. వీరిని ఎఫ్‌ఆర్‌ఆర్‌వో అధికారులకు అప్పగిస్తామని ఆయన తెలిపారు. అదే విధంగా ఎటువంటి ధ్రువ పత్రాలు, నెంబర్‌ప్లేట్లు లేని 28 బైకులు, నాలుగు కార్లు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. పారమౌంట్‌ కాలనీలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్‌షాప్‌ను కూడా సీజ్‌ చేసి అక్కడ నుంచి 28 చీఫ్‌ లిక్కర్‌ బాటిల్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్డన్‌ సెర్చ్‌లో అదనపు డీసీపీ ఎక్బాల్‌ సిద్దిఖీ, ఏసీపీలు సయ్యద్‌ ఫయాజ్‌, విజయ్‌శ్రీనివాస్‌, సుదర్శన్‌, మునావర్‌, టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్‌ ఎల్‌.రమేష్‌ నాయక్‌, గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ సైదులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా జియాగూడ కేసరి హనుమాన్‌ బస్టాండ్‌



పార్టీల జెండాలతో హనుమాన్‌ బస్టాండ్‌

జియాగూడ: జియాగూడ కేసరి హనుమాన్‌ బస్టాండ్‌ పలు పార్టీల జెండాల గద్దెలు, మ్యాన్‌హోళ్ల కారణంగా నిరుపయోగంగా మారింది. ప్రతిరోజూ సికింద్రాబాద్‌ నుంచి జియాగూడ, లంగర్‌హౌజ్‌ వరకు 50కి పైగా బస్సుల రాకపోకలు కొనసాగుతున్నాయి. కేసరి హనుమాన్‌ చౌరస్తా బస్టాండ్‌ కావడంతో ప్రయాణికుల రద్దీ బాగానే ఉంటుంది. ఇక ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్టాండ్‌ వద్ద షెల్టర్‌ పూర్తిగా నిరుపకయోగంగా మారింది. బస్‌ షెల్టర్‌ ఏర్పాటు చేసిన మొదట్లో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. క్రమేణా స్థానిక నాయకులు తమ తమ అభిమాన పార్టీల జెండాలను గద్దెలు నిర్మించారు. దీనికి తోడు కచ్చమోరి లేన్‌ మ్యాన్‌హోళ్లు ఇక్కడే ఉండగా అవి కాస్త నోర్లు తెరిచి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే జెండాలు తొలగించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్‌: 11 కేవీ కమేళ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని దరియాబాగ్‌, పన్నీపురా, మార్కండేయ భవన్‌ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే గంగానగర్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని కమేళా గేట్‌, గంగానగర్‌ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

27న ఆరె కటిక విద్యార్థులకు నోట్‌బుక్స్‌ పంపిణీ

గౌలిపురా: గౌలిపురా ఆరె కటిక సూర్యవంశీ సంఘ్‌ ట్రస్టు ఆధ్వర్యంలో 2025 విద్యా సంవత్సరానికి ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్‌ వరకు చదువుకుంటున్న ఆరె కటిక విద్యార్థులకు నోట్‌ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు గౌలిపురా ఆరె కటిక సూర్యవంశీ సంఘ్‌ ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్‌ తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 90 శాతం మార్కులు సాధించిన ఆరె కటిక సామాజిక విద్యార్థులకు మెమొంటో, బహుమతులను అందజేయనున్నామన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 27న నోట్‌ పుస్తకాలు, మెమొంటో, బహుమతులను అందజేయనున్నామన్నారు.

అక్రమంగా డబ్బు వసూలు చేసేందుకు యత్నించిన వ్యక్తి అరెస్ట్‌

డబీర్‌పురా: కొత్తగా ఇంటిని నిర్మిస్తున్న ఇంటి యజమాని వద్ద డబ్బు వసూలు చేసేందుకు యత్నించిన ఓ వ్యక్తిని శుక్రవారం రెయిన్‌బజార్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..రెయిన్‌బజార్‌లో కొత్తగా నిర్మిస్తున్న భవన నిర్మాణ యజమాని నుంచి రాజకీయ నాయకుడి పేరుతో యాకుత్‌పురాకు చెందిన సయ్యద్‌ అలీమ్‌ (36) రూ.2 లక్షలు వసూలు చేయడానికి ప్రయత్నించాడు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు రెయిన్‌బజార్‌ పోలీసులతో కలిసి దాడి చేసి సయ్యద్‌ అలీమ్‌ను అరెస్ట్‌ చేసి తదుపరి విచారణ నిమిత్తం రెయిన్‌బజార్‌ పోలీసులకు అప్పగించారు.

పాతబస్తీ బోనాలకు అదనపు బడ్జెట్‌ కేటాయించాలి



చార్మినార్‌: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఇప్పటికే మంజూరు చేసిన రూ.20 కోట్ల నిధులకు తోడు మరికొంత అదనపు బడ్జెట్‌ కేటాయించాలని భాగ్యనగర్‌ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్‌ గోపిశెట్టి రాఘవేందర్‌ కోరారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం కలిసి మరో రూ.10 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌

నాంపల్లి: పేదలకు విద్య, వైద్యం కచ్చితంగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ అన్నారు. శుక్రవారం చింతలబస్తీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యునాని ఆస్పత్రులను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు మెడికల్‌ స్టోర్‌లో మందుల నిలువ, క్యాడర్‌ స్ట్రెంత్‌, డాక్టర్ల పనితీరుపై పబ్లిక్‌ హెల్త్‌ నర్సు శకుంతలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం మొదలైనందున సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..వైద్య సేవలు సరిగా అందిస్తున్నారా, మందులు ఇస్తున్నా, ఏఎన్‌ఎంలు సరిగా విధులు నిర్వహిస్తున్నా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ సెంటర్‌ సూపర్‌వైజర్‌ శకుంతల, కార్పొరేటర్‌ విజయారెడ్డి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్‌ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్‌ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ఎంవీవీ సుబ్రహ్మణ్యం

అబిడ్స్‌: విద్యార్థుల సంక్షేమానికి పూర్వ విద్యార్థులు అండగా నిలవడం ఎంతో అభినందనీయమని ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అబిడ్స్‌ కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయ పాఠశాలలో 1975 నుంచి 1983 వరకు అదే పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థి సుబ్రహ్మణ్యం ప్రస్తుత విద్యార్థులకు నోట్‌బుక్స్‌, పెన్నులు, పెన్సిళ్లు, స్కూల్‌ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సందర్భంలో చల్లా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ఎంతో మంది పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలకు సేవలందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ..తాను చదువుకున్న పాఠశాలకు తిరిగి వచ్చి విద్యార్థులకు నోట్‌బుక్స్‌, ఇతర సామగ్రి అందిస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు. సుబ్రహ్మణ్యం సతీమణి భరణి లక్ష్మి, ఆయన కుమారుడు రామ్‌ తరుణ్‌, మంజుల, సునిత, జ్యోతి, ప్రియ, కవిత, హేమ, సంగీత పాల్గొన్నారు.

పెండింగ్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయాలి



ప్రొఫెసర్‌ బాలకృష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతలు

నాంపల్లి: పెండింగ్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఇంజనీరింగ్‌ కళాశాలల్లో అశాస్త్రీయంగా పెంచిన ఫీజులు తగ్గించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఎస్‌.నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌.సుమంత్‌ కోరారు. ఈ మేరకు శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ ప్రొఫెసర్‌ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యారంగం సంక్షోభంలో రాష్ట్రం మునిగిపోయిందని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా సుమారు రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన అకాడమిక్‌ సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల సర్టిఫికెట్లు తీసుకునే అవసరం ఉంటుందని, ఈ సమస్యను గుర్తించకుండా నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రుక్మత్‌ పాషా, రాష్ట్ర గర్ల్స్‌ కన్వీనర్‌ కె.స్వాతి, గ్రేటర్‌ హైదరాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌.అంజి, జిల్లా కోశాధికారి ధనుష్‌, నాయకులు క్రాంతి, రంజిత్‌, సోహేల్‌ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. శుక్రవారం ఆయన హకీంపేట్‌లో షాదీ ముబారక్‌, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు అన్ని రకాల ధ్రువపత్రాలు జత చేయాలన్నారు. సంక్షేమ పథకాలకు ప్రభుత్వం నేరుగా నగదు ఇవ్వదన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్‌ నాయకులు అలీముద్దీన్‌, సయ్యద్‌ రఫత్‌హుస్సేన్‌ తదితరులున్నారు.

అలియాబాద్‌లో హెచ్‌ఐవీ, కుష్టు వ్యాధి స్క్రీనింగ్‌ శిబిరం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

శాలిబండ: అలియాబాద్‌ యూపీహెచ్‌సీ కేంద్రంలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా శుక్రవారం టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌ అవగాహన, స్క్రీనింగ్‌ శిబిరం, హెచ్‌ఐవీ, కుష్టు వ్యాధి స్క్రీనింగ్‌ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్‌ జె.వెంకటి, తెలంగాణ జాయింట్‌ డైరెక్టర్‌ (టీబీ) అండ్‌ రాష్ట్ర టీబీ అధికారి డాక్టర్‌ ఎ.రాజేశం, హైదరాబాద్‌ జిల్లా టీబీ నియంత్రణ అధికారి (డీటీసీఓ) డాక్టర్‌ చలాదేవి, కార్పొరేటర్‌ మహ్మద్‌ ముస్తాఫా అలీ ముజఫర్‌ హాజరయ్యారు. ఈ రెండు శిబిరాలను ఎస్పీహెచ్‌ఓ డాక్టర్‌ అనితా రాణి మార్గదర్శకత్వంలో జరిగాయి. 200 మందికి పైగా క్షయవ్యాధి పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఐవీ, కుష్టు వ్యాధి స్క్రీనింగ్‌ క్యాంపులో ర్యాపిడ్‌ టెస్ట్‌ కిట్‌లను ఉపయోగించి 80 మంది వ్యక్తులను హెచ్‌ఐవీ కోసం పరీక్షించారు. టీబీ శిబిరానికి టీబీ వైద్యాధికారిణి డాక్టర్‌ సమ్మయ్య బాను నాయకత్వం వహించారు.